క్లుప్తంగా

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి కార్యదర్శి ప్రణాళికలు తయారు చేయాలని జెడ్పీ సీఈఓ భూపతి చిరంజీవి సూచించారు. శనివారం ఒంగోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఈ ప్రణాళికలకు సంబంధించి ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, జాయింట్ డైరెక్టర్ రామనాథం, ఎంపీడీఓ యు.శేషుబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, వీవోఏల అధ్యక్షులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం కషాయంతో లద్దె పురుగు నివారణ

ఒంగోలు సిటీ: శనగ పంటలో పచ్చపురుగు, పొగాకులో లద్దె పురుగు నివారణ కోసం బ్రహ్మాస్త్రం కషాయం చాలా బాగా ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్చార్జ్ రాధా సింగమనేని తెలిపారు. శనివారం ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో డీపీఎంయూ సుభాషిణి నేతృత్వంలో నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) షాప్ కోసం శనగ, వరి, మినుము వంటి పంటల రక్షణకు బ్రహ్మాస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా రాధా సింగమనేని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు వాడటం వలన ఆరోగ్యకరమైన పంటలు సాగుచేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్ కృష్ణవేణి, మన్మథ, ఐశ్వర్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.



సూరారెడ్డిపాలెం రైల్వే గేటు పడి నిలిచిపోయిన వాహనాలు



రోడ్డుపై భారీగా ఆగిన వాహనాలు



ఒకేసారి రాకపోకలు సాగిస్తున్న రెండు రైళ్లు

రైల్వే గేటు.. పెద్ద చేటు..!

- సూరారెడ్డిపాలెం రైల్వే గేటుతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- రైళ్ల రాకపోకల సమయంలో గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- ప్రతిరోజూ సుమారు పది వేల మంది ప్రయాణికులకు అవస్థలు
- అత్యవసరంగా హాస్పిటల్‌కు వెళ్లాల్సిన సమయంలో గేటు పడితే.. అంతే సంగతులు
- ఏళ్ల తరబడి సంతమతమవుతున్న ప్రజలు
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నా.. పట్టించుకోని పాలకులు, అధికారులు

కొత్తపట్నం: మండలంలోని పలు గ్రామాల ప్రజలు టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న రైల్వే గేటుతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించకుండా అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజూ 180 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, రైలు వచ్చే ప్రతిసారీ సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న రైల్వే గేటు మూసేస్తుంటారు. జాతీయ రహదారి నుంచి కొత్తపట్నం మండలంలోని గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై సూరారెడ్డిపాలెం వద్ద రైల్వే గేటు ఉంది. ఈ రోడ్డుపై ప్రతిరోజూ సుమారు 10 వేల మందికిపైగా వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రైళ్ల రాకపోకల సమయంలో రైల్వే గేటు వేస్తుండటంతో రోడ్డుపై ప్రయాణించే వారంతా గంటల తరబడి వేచి ఉంటూ అవస్థ పడుతున్నారు.

అత్యవసర సమయంలో అగచాట్లే...

ఒకసారి రైల్వే గేటు వేస్తే.. ఎన్ని రైళ్లు రాకపోకలు సాగించాలో.. ఎంత సేపటి తర్వాత తెరుస్తారో తెలియని పరిస్థితి. ఆ సమయంలో అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లే రోగులు ఉంటే అక్కడే చావాల్సిందే అన్నట్లుగా పరిస్థితి నెలకొంది. గుండె పోటు, ఇతర ప్రమాదాలు, తదితర అనారోగ్య సమస్యలతో అత్యవసరంగా వాహనాల్లో, 108 అంబులెన్స్‌లలో ఆస్పత్రికి వెళ్లే వారు రైల్వే గేటు దగ్గర వేచి ఉండాల్సిన సమయంలో అక్కడే ప్రాణాలు పోతున్నాయంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు సమీపంలో ఉన్న ఈతముక్కల, సూరారెడ్డిపాలెం, మడనూరు, రాజుపాలెం, తేటుపురం గ్రామాల్లో సుమారు 40 వేల మంది జనాభా ఉంటున్నారు. వారిలో ప్రతిరోజూ ఎవరోఒకరికి బాగలేక 108లో హాస్పిటల్‌కు వెళ్తుంటారు. వారిలో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఉంటుంటారు. వారంతా అత్యవసరంగా హాస్పిటల్‌కు వెళ్లలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

నిత్యం నరకం చూస్తున్న 8 గ్రామాలకుపైగా ప్రజలు...

కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల, మడనూరు, సంకువారిగుంట, రాజుపాలెం, కొత్తపట్నం, గమళ్లపాలెం, టంగుటూరు మండలంలోని తేటుపురం, సూరారెడ్డిపాలెం గ్రామాల ప్రజలు ఒంగోలు, ఇతర ఊర్లకు రాకపోకలు సాగించాలంటే సూరారెడ్డిపాలెం రైల్వే గేటు మీదుగానే ప్రయాణించాలి. అక్కడ నిమిషానికి ఒకసారి గేటు పడుతుండటం వలన ఎన్నో ఏళ్ల నుంచి ఆయా గ్రామాల ప్రజలు నరకం చూస్తున్నారు. కార్యాలయాలకు, కార్యక్రమాలకు వెళ్లేవారు, కూలీలు రైల్వే గేటు దగ్గర వేచి ఉండి సమయానికి చేరలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గత ప్రభుత్వంలో అండర్ బ్రిడ్జి మంజూరు చేయించినట్లు చెప్పినా.. ఒంగోలు నగరం నుంచి వచ్చే వర్షం నీరు నిలుస్తుందని, వాహనాల రాకపోకలు స్తంభిస్తాయని, అండర్ బ్రిడ్జి వద్దని ప్రజలు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నష్టపోతున్న రొయ్యల సాగు రైతులు...

కొత్తపట్నం మండలంలో రొయ్యల సాగు భారీగానే సాగుతుంటుంది. సంబంధిత రైతులు హేచరీల నుంచి రొయ్య పిల్లలు, ఇతర రాష్ట్రాల నుంచి నాప్లిన్ (రొయ్యల గుడ్లు) తీసుకురావాలంటే రైల్వే గేటు దగ్గర ఒత్తిడికి గురై చనిపోతున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. సాగు చేసిన రొయ్యలను ఎగుమతి చేసే సమయంలోనూ అక్కడకు వచ్చేసరికే గేటు వేయడం వలన సరుకు కుళ్లిపోయి పనికిరాకుండా పోతోంది. కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంతంలో 20 రొయ్యపిల్లల హేచరీలు ఉన్నాయి. వాటిలోకి తల్లి రొయ్యలు దిగుమతి చేసుకోవాలంటే ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకోవాలి. అవన్నీ సూరారెడ్డిపాలెం రైల్వే గేటు నుంచే రాకపోకలు సాగించాలి. రొయ్య పిల్లలను తయారు చేసి మళ్లీ ఎగుమతి చేయాలంటే కూడా ఈ గేటు నుంచే తరలించాలి. రొయ్య పిల్లలు, నాప్లిన్‌ను చాలా జాగ్రత్తగా తరలించాలి. అవి సున్నితంగా ఉండటం వలన కాస్త ఆలస్యమైనా ప్రాణాలు కోల్పోతాయి. రైల్వే గేటు వలన కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈతముక్కల, తేటుపురం, మడనూరు, రాజుపాలెం గ్రామాల రొయ్యల రైతులు సాగు చేసిన వేల టన్నుల రొయ్యలను ఎగుమతి చేస్తుంటారు. సూరారెడ్డిపాలెం రైల్వే గేటుతో నష్టపోతున్నామంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే గేటుతో నష్టపోతున్నాం



దూర ప్రాంతాల నుంచి వచ్చే నాప్లిన్ (రొయ్యల గుడ్లు) సూరారెడ్డిపాలెం రైల్వే గేటు దగ్గరకు వచ్చేసరికి వేచి ఉండి ఒత్తిడికి గురై చనిపోతోంది. నాతో పాటు 20 హేచరీల యజమానులు రైల్వే గేటు వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాలైన పాండిచ్చేరి, చెన్నై, గుజరాత్, వైజాగ్ వంటి ప్రాంతాల నుంచి నాప్లిన్ దిగుమతి చేసుకుని హేచరీలో రొయ్య పిల్లలను ఉత్పత్తి చేస్తుంటాం. వాటిని ఎగుమతి చేసే సమయంలోనూ దూర ప్రాంతాలకు తీసుకెళ్లాలి. రైల్వే గేటు వలన ఎగుమతులు, దిగుమతులకు చాలా ఇబ్బంది పడుతున్నాం.
– కుంభా శ్రీను, హేచరీ యజమాని, మడనూరు

ఆకుకూరలు, కూరగాయలు పాచిపోతున్నాయి




ప్రతి రోజు ఆటోలో ఆకుకూరలు, కూరగాయలు వేసుకుని టంగుటూరు వెళ్తుంటాను. మార్కెట్ సమయానికి వెళ్లి సరుకు తాజాగా ఉంటేనే కొనుగోలు చేస్తారు. కానీ, రైల్వే గేటు పడి గంటల సమయం వృథా అవుతుండటంతో పాటు ఆకుకూరలు వాడిపోయి పనికిరాకుండా పోతున్నాయి. మాకు నష్టం వాటిల్లుతోంది. అందువలన రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాం.
– కోటేశ్వరరావు, ఆటోడ్రైవర్/ఓనర్, మడనూరు

విద్యార్థులను సమయానికి తీసుకెళ్లలేకపోతున్నా



సూరారెడ్డిపాలెం రైల్వే గేటు వలన ఒంగోలులో చదివే విద్యార్థులను సమయానికి తీసుకెళ్లలేకపోతున్నా. ప్రతిరోజూ ఇదే పరిస్థితి. స్కూల్ ముగించుకుని వచ్చేటప్పుడు కూడా అవస్థలే. సరైన సమయానికి వెళ్లలేక, తిరిగి రాలేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. రైల్వే గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.
– గద్దం రమేష్, స్కూల్ బస్ డ్రైవర్, ఈతముక్కల

రోజువారీ కూలి పనులు కోల్పోతున్నాం



ప్రతి రోజూ బేల్దారి పనులకు వెళ్లి వస్తుంటాం. పనులకు వెళ్లేటప్పుడు రైల్వే గేటు పడి సమయానికి వెళ్లలేక కూలి కోల్పోతున్నాం. ఒక్కోసారి గంటల తరపడి గేటు తీయకపోవడం వలన తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నాం. రైల్వే గేటు స్థానంలో ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే మాకు బాగుంటుంది.
– కసుకుర్తి కోటేశ్వరరావు, బేల్దారు మేస్త్రీ, ఈతముక్కల

మాలధారులకు నిత్య అన్నదానం ప్రారంభం

- అయ్యప్ప మాల ధరించిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. సర్వదీక్ష మాలలు ధరించిన భక్తులందరికీ వారి దీక్ష పూర్తయ్యేంత వరకు కల్యాణ మండపంలో అన్నదానం చేయనున్నట్లు వారు తెలిపారు. గత 23 సంవత్సరాలుగా బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి మాలలు ధరించిన భక్తులందరికీ అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. తొలుత బూచేపల్లి శివప్రసాదరెడ్డి సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురుస్వామి చేతుల మీదుగా అయ్యప్పస్వామి మాల ధరించారు. అనంతరం అయ్యప్పస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో బూచేపల్లి కుటుంబ సభ్యులతో పాటు భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాలధారులకు అన్నదానం చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



అయ్యప్పస్వామి మాల ధరిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

మిరప పంటకు బీమా చేయించుకోవాలి

నాగులుప్పలపాడు: మిరప సాగు చేసే రైతులు పంటకు రక్షణగా తప్పకుండా పంటల బీమా చేయించుకోవాలని ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష సూచించారు. శనివారం మండలంలోని పోతవరం గ్రామంలో ఉద్యానవన పంటలను పరిశీలించి మాట్లాడారు. మిరప సాగు చేసే రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రబీ సీజన్లో మిరప సాగు చేసే రైతులంతా దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం ద్వారా ఎకరాకు రూ.525 ప్రీమియంను కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా చెల్లించాలని సూచించారు. పంట సాగుకు బ్యాంక్ ద్వారా లోన్ తీసుకుంటే బ్యాంక్ వారి ద్వారా కూడా ప్రీమియం అమౌంట్ జమ చేయవచ్చని చెప్పారు. పంట నష్టపోతే ఎకరాకు గరిష్టంగా రూ.1,05,000 వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. డిసెంబర్ 15వ తేదీలోగా ప్రీమియం కట్టాలని సూచించారు. ఇతర వివరాలకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు. మిరప సాగుకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం



విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్



బాల పంచాయతీ నిర్వహిస్తున్న డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు

చీమకుర్తి: బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలపై చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా చీమకుర్తిలోని సీపీఎస్ స్కూల్లో విద్యార్థులకు బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన దుర్గలక్ష్మి, పార్వతీశం, నిహారికను అభినందించారు. 14 సంవత్సరాల్లోపు వయస్సు బాలలను పాఠశాలల్లో చేర్పించాలని, లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది చిరంజీవి, సీపీఎస్ స్టాఫ్ పాల్గొన్నారు.

మైనంపాడు డైట్ కళాశాలలో...

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు డైట్ కళాశాలలో శనివారం బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయులకు మన కోసం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల పంచాయతీల ఆధ్వర్యంలో వివిధ ఉపసమితిలు ఏర్పాటు చేసి అందరూ సమానత్వంగా పాల్గొనేలా చూడాలని ప్రతిపాదించారు. ప్రతి ఉపసమితిలో 57 మంది సభ్యులు ఉండాలని, ఒక కన్వీనర్, ఒక కో కన్వీనర్ నాయకత్వం వహిస్తారని తెలిపారు. వారానికి ఒకసారి సమావేశం నిర్వహించి తమ బాధ్యతలను సమీక్షిస్తారన్నారు. విద్య కమిటీ, ఆరోగ్య పోషణ కమిటీ, పర్యావరణ కమిటీ, క్రీడా సాంస్కృతిక కమిటీ, గ్రీవెన్స్ వీడ్రెస్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలు సమాజంలో అన్నివిధాలా అభివృద్ధి కోసం పనిచేయాలని డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు వెల్లడించారు. ఛాత్రోపాధ్యాయులతో మాక్ పంచాయతీ నిర్వహించారు. బంగారు బాల్యం కార్యక్రమానికి సంబంధించి ఛాత్రోపాధ్యాయులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు ఆర్.శ్రీనివాసులు, ఎం.రవీంద్ర, ప్రసాదు, ఎస్.కృపావతి, ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చుండూరి రవిని కలిసిన పలువురు నాయకులు

మద్దిపాడు/నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చుండూరి రవిని ఆ పార్టీ మద్దిపాడు మండల ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, మాజీ వైస్ ఎంపీపీ భర్త గుడ్డపాతల రవి, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. అదేవిధంగా నాగులుప్పలపాడు ఎంపీపీ భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, లిడ్ క్యాప్ స్టేట్ మాజీ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు కాటూరి ఆదియ్య, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.



చుండూరి రవిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆదెన్న, ఒంగోలు, కొత్తపట్నం మండలాల నాయకులు

ఒంగోలు, కొత్తపట్నం నాయకుల అభినందనలు...

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చుండూరి రవిని శనివారం ఒంగోలులో పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సైకం లక్ష్మీశారద, కొత్తపట్నం మండల మాజీ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కంభం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, గంగవరపు ప్రవీణ్, మహిళా నాయకులు బడుగు ఇందిర, భూమిరెడ్డి రవణమ్మ, బత్తు ప్రమీల, వడ్లమూడి వాణి, కందురు రమణమ్మ, ఓబుల్ రెడ్డి, వెంకటేశ్వర్లు (చిన్నా), బుజ్జి, సురేష్, షేక్ మీరావలి, నాగూర్, వెన్నపూస వెంకటరెడ్డి, ఒంగోలు రూరల్, మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి చేరుకుని చుండూరి రవికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు.



చుండూరి రవికి అభినందనలు తెలుపుతున్న మద్దిపాడు మండల నాయకులు



నాగులుప్పలపాడు మండల నాయకులు

టిఫిన్ దుకాణం దగ్ధం

చీమకుర్తి రూరల్: మండలంలో మర్రిచెట్లపాలెం కూడలి నుంచి అయ్యప్పరాజుపాలెం వెళ్లే మార్గం మధ్యలో టిఫిన్ దుకాణం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఇద్దరు వృద్ధులు జీవనోపాధి కోసం టిఫిన్ దుకాణం నిర్వహిస్తుండగా, గ్యాస్ లీకై సిలిండర్ పేలడంతో దగ్ధమైంది. చీమకుర్తి సీఐ సుబ్బారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

డిసెంబర్ 11న గీతా జయంతి

ఒంగోలు మెట్రో: గీతా జయంతి కార్యక్రమాన్ని డిసెంబర్ 11వ తేదీ ఒంగోలులో ఘనంగా నిర్వహించనున్నట్లు సనాతన హిందూ ధర్మసాధన పరిషత్తు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ కోటేశ్వరానందస్వామి, అధ్యక్షుడు బ్రహ్మశ్రీ నరసింహానందస్వామి, జనరల్ సెక్రటరీ బ్రహ్మశ్రీ కృష్ణమోహనానందస్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఎన్జీఓ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 11వ తేదీ శోభాయాత్ర, గీతా పారాయణం 18 అధ్యాయాలు, గాయత్రి మహా మృత్యుంజయ యజ్ఞం, 108 యజ్ఞగుండాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అందరూ పాల్గొనాలని కోరారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

నాగులుప్పలపాడు: గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మూడోరోజు గ్రంథాలయోద్యమకారులను స్మరించుకున్నారు. నాగులుప్పలపాడు శాఖా గ్రంథాలయంలో మండల విద్యాశాఖాధికారులు టీ రవికుమార్, ఇ.రమణయ్య పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది మహనీయుల త్యాగాలతో ఏర్పాటైన గ్రంథాలయాలను భావితరాలకు అందించాలన్నారు. సామాజిక కార్యకర్త తెలగతోటి సామ్యూల్, తదితరులు పాల్గొని గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథపాలకుడు శ్రీనివాసులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు స్థానిక గ్రంథాలయ గ్రంథపాలకుడు కే సత్యనారాయణ, హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బి.ఇందిరమ్మ, డి.విజయమ్మ, వి.మాధవీలత, హైస్కూల్ పీడీ కే మల్లికారాణి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులకు నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ రోహిణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సీహెచ్ అజయ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో గ్రంథాలయ పోరాట మహనీయులకు నివాళులర్పిస్తున్న ఎంఈఓలు



సంతనూతలపాడులో...

పంచాయతీ కార్యదర్శికి సత్కారం



రాధికను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులు

సంతనూతలపాడు: మండలంలోని గుడిపాడు పంచాయతీ కార్యదర్శి కే రాధిక ఐదేళ్లుగా ఇక్కడ పనిచేసి టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం బదిలీ అయిన సందర్భంగా శనివారం గ్రామ సచివాలయంలో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ కే పుష్ప, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, ఎంపీటీసీ టీ సుజాత, గ్రామాభివృద్ధి నాయకులు కే సుబ్బారావు, టి.శేషిరెడ్డి పాల్గొని కార్యదర్శి సేవలను కొనియాడారు. పలువురు కార్యదర్శులు, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ఒంగోలు సిటీ: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే తమ లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు సుభాషిణి తెలిపారు. శనివారం ఒంగోలు మండలంలోని కొప్పోలు గ్రామంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు సుభాషిణి ఆధ్వర్యంలో వెంకటేశ్వర ప్రకృతి వ్యవసాయ పనుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏవో కిషోర్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ వాకా మాధవి, వ్యవసాయ టీం సభ్యులు, మహిళా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

యశోద అంతిమయాత్రను అడ్డుకున్న పోలీసులు



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: ప్రేమికుడి చేతిలో మోసపోయి న్యాయం కోసం పోలీసుల చుట్టూ తిరిగి విసిగిపోయి ఆత్మహత్యకు పాల్పడిన కర్ణాటకకు చెందిన యశోద శుక్రవారం మరణించడం తెలిసిందే. ఆమె మృతదేహానికి అంత్యక్రియలు చేయడానికి కుటుంబ సభ్యులు తిరస్కరించిన నేపథ్యంలో దళిత నాయకులు ముందుకు వచ్చారు. కమ్మపాలెం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు యశోద మృతదేహాన్ని మార్చురి నుంచి అంబులెన్సులోకి ఎక్కించారు. అంతిమ యాత్ర ప్రారంభం అయిన కొద్దిసేపటికే ఒంగోలు తాలూకా ఎస్సై పావని వచ్చి అడ్డుకున్నారు. అంబులెన్సుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ క్రమంలో దళిత నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. 40 రోజులుగా న్యాయం కోసం యశోద పోలీసుల చుట్టూ తిరుగుతుంటే ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. యశోద మృతికి కారకుడైన మత్తయ్యను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న తాలూకా సీఐ అజయ్ కుమార్ దళిత నాయకుల డిమాండ్ మేరకు కమ్మపాలెం శ్మశాన వాటికలో యశోద అంత్యక్రియలు నిర్వహించడంతో వివాదం సద్దుమణిగింది.